# 3. వ్యవస్థ

పట్టువదలని నిరుద్యోగి విసుగు లేకుండా ఇంటర్వ్యూకు వెళ్ళినట్టుగా చెట్టువద్దకువెళ్ళి, చెట్టెక్కి శవాన్ని భుజంపై వేసుకొని, చెట్టుదిగి పట్టుదలగా నడుస్తున్నాడు జగన్ మోహన్ - — భేతాళుడు అతనితో "మానవా! ఎన్నో కష్టనష్టాలకోర్చి నన్ను వశం చేసుకోవాలని నీవు చేసే ప్రయత్నం బాగానేవుంది — నా ఊహ నిజమయితే నువ్వు నాయకుడి వవ్వాలనుకుంటున్నావు—"

జగన్మోహన్ గంభీరంగా నడుస్తున్నాడు — "భేష్ మానవా! నీ పట్టుదల బ్రహ్మాండంగా వుంది — నీకు భారం తెలియకుండా ఉండడానికో కథ చెబుతాను— అని కథ చెప్పసాగాడు భేతాళుడు—

-జనార్ధన్ అగర్భ శ్రీమంతుడైనా గర్వమసలేలేనివాడు-చాలా మంచి వాడు-ఎవరికీహాని చేసెరుగడు. అతడాదర్శనాయకుల కథలు చదివాడు దేశనాయకుల చరిత్రలు చదివాడు. దేశంకొరకు సర్వం త్యాగంచేసిన త్యాగమూర్తులగూర్చి చదివాడు.ఎన్నో సినిమాలు చూసాడు-పేదరికాన్ని నిర్మూలించడానికి హీరో ఒక్కడే పూనుకుని విజయవంతంకావటం చూపే సినిమాలుచూశాడు-సినిమాల్లో నాయకుడు ఒంటరిగానే పోరాడుతూ అన్యాయాలు, అక్రమాలు, అవినీతి, లంచగొండితనం లాంటి వాటి నెదుర్కోవడం చూసాడు—తను చేసే మంచి పనులకు అడ్డంవచ్చే సంఘ విద్రోహుల్లాంటి ప్రతినాయకులను చితకదన్ని, ఒక్కోసారి చంపి ధర్మం నాలుగుపాదాల్లా నడిపించే హీరోల సినిమాలు చూసాడు — ఎన్నో కథలు చదివాడు—హీరోగారు అనాథరక్షకుడుగా, ఆర్తత్రాణ పరాయణుడుగా ధర్మసంస్థాపన చేయడం చూసాడు — అన్ని ఆదర్శభావాలను జీర్ణం

చేసుకున్నాడు-చాలావాటిన్ని అలవర్చుకున్నాడు- దేశం కొరకేమైనాచేయాల నుకున్నాడు- ప్రజల కోసం పాటుపడాలనుకున్నాడు- తాను మంచివాడైతే సినిమాల్లో, కథల్లో, హీరోలా కొంతైనా మంచి చేయొచ్చనుకున్నాడు—

రాజకీయాల్లో ప్రవేశించి అధికారం చేజిక్కించుకుంటే తన పని సులభమవుతుందనుకున్నాడు — వెంటనే ఓ రాజకీయపార్టీని స్థాపించాడు తన పార్టీలో మంచి వాళ్ళందరికి ద్వారాలు తెరిచాడు ... స్థానం కల్పించాడు — ఇతర పార్టీల్లో స్థానంలేనివాళ్ళు కొందరు, ఇతని ఆదర్శాలు వచ్చి కొందరు పార్టీలో చేరారు — త్వరలోనే ఎన్నికలొచ్చాయి — దేశమంతా సుడిగాలిలా చుట్టివచ్చాడు జనార్ధన్— తన ఆకర్షనీయమైన మాటలతో జనాలను వశపరచుకున్నాడు — ఎన్నో ఏళ్ళుగా ఇతరపార్టీల పాలనతో విసుగుచెందిన ప్రజలకు జనార్ధన్ ఆశాజ్యోతిలా కనిపించాడు- ఎన్నికల్లో జనార్ధన్‌ను గణనీయమైన మెజారిటీతో గెలిపించారు ప్రజలు-

గెలిచిన తర్వాత ప్రజలకు మేలుచేయాలని హృదయపూర్వకంగానే భావించాడు జనార్ధన్ — ఎన్నో ప్రజోపయోగకర పథకాలను ప్రవేశపెట్టబోయాడు .... బియ్యం ధర మరికొన్ని నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించడానికి ప్రయత్నించాడు —— అయితే అతని పథకాలు పథకాలుగానే మిగిలిపోతున్నాయి ఎన్నివిధాల ప్రయత్నించినా, తానే సర్వాధికారైనా ఏదీ అమలుచేయడం వీలుకాక విఫలమయ్యాడు—విసిగి రాజకీయాల్లోంచే విరమించుకున్నాడు—చెప్పడం ఆపాడు భేతాళుడు—

జనార్ధన్ ఎన్నోమంచి పనులు హృదయపూర్వకంగానే చేయాలనుకున్నా ఎందుకు చేయలేకపోయాడు....?

అసలు లోపమెక్కడుంది—?

ఈ ప్రశ్నలకు జవాబులు తెలిసీ చెప్పకపోయావో నిన్ను శాశ్వతంగా నాయకుడు కాకుండా శపిస్తాను —

భేతాళుడి ప్రశ్నలకు సమాధానాలు చెప్పసాగాడు జగన్మోహన్–

ఆగర్భ శ్రీమంతుడైన జనార్ధన్ అధికారం చేతిల్లోలోకి వచ్చిన తర్వాత కూడా సేవాభావంతోనే పనిచేస్తాననుకోవడమన్నది నమ్మదిగ్గదిగాలేదు అయినా అతనిపైవున్న ఆదర్శభావాల ప్రభావంవల్ల తాను నమ్మిన పథకాలను అమలు చేయడానికి హృదయపూర్వకంగానే భావించాడనుకుందాం– జనార్ధన్ మంచివాడు–నిజమే–కాని అతనికి ఈ వ్యవస లోపాలకు మూలమెక్కడుందో తెలియదు –— గద్దెమీద కూర్చుండేదెవరైనా దేశాన్ని నడిపించేదెవరో తెలియదు...

ఈ దేశాన్ని పరోక్షంగా నడిపించే వ్యాపార వర్గాలు, పారిశ్రామికవేత్తలు తమకు నష్టం జరిగితే ఊర్కుంటారా—? ధరలు తగ్గిస్తే, వాళ్ళ లాభాలకంతరాయం కల్గించే మరేపనైనా చేస్తే వాళ్ళకాగ్రహం వస్తుంది — అధికారంలో వున్నవాళ్ళనే పట్టుకొని ఆ పథకాలు విఫలమయ్యేలా చూస్తారు—

కేవలం కథలు, సినిమాలతో ప్రభావితమై సిద్ధాంతాల బలంలేకుండా ఆదర్శాలపేరుతో ఏదో చేద్దామనుకోవడం శుద్ధదండుగ —ఈ వ్యవస్థను కేవలం ఆదర్శాల బలంతో, సినిమాల్లోలా సంస్కరణలతో బాగుపరుస్తాననుకోవడం భ్రమ–ఒక వ్యక్తో, కొందరు వ్యక్తులో మంచివాళ్ళైనంత మాత్రాన వాళ్ళవల్ల ఇతర్లకు నష్టం లేకపోవచ్చుగాని సమాజానికంతగా ఉపయోగంలేదు– ...—ఆ మంచితనానికి తోడుగా సిద్ధాంతబలమున్న పార్టీకావాలి—వెనుక లక్షలాది మంది అనుచరులుండాలి — వ్యవస్థను పాడుచేస్తున్న చీడపురుగులకు మందువేయాలి—అప్పుడే మార్పుసాధ్యం కాని ఒకరిద్దరి మంచితనంవల్ల, వ్యక్తిగత హీరోయిజంవల్ల కాదు—"

జగన్మోహన్‌కు మౌనభంగం కలుగగానే శవంతోసహా మాయమై చెట్టెక్కి కూర్చున్నాడు భేతాళుడు—

(జీవగడ్డ జులై 21, 1985.)